రతన్ టాటా... ఈ పారిశ్రామిక దిగ్గజం రాష్ట్ర ప్రజల అభిమానం పొందిన వ్యక్తి. సేవా కార్యక్రమాలకు ఆయన చిరునామా. రాష్ట్రానికి తరచూ వచ్చేవారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సన్నిహితునిగా ముద్రపడ్డారు. - న్యూస్‌టుడే, భువనేశ్వర్

ఒడిశాతో రతన్ టాటాకు
విడదీయలేని బంధం

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చిన పారిశ్రామికవేత్త



నవీన్‌తో రతన్‌టాటా

రతన్ టాటా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎందరిలో ఉపాధి కల్పించారు. జాజ్‌పూర్ జిల్లా కళింగనగర్ పారిశ్రామిక వాడలో టాటాస్టీల్ ఉక్కు కర్మాగారం, గంజాం జిల్లా గోపాల్‌పూర్‌లో టాటా ఫెర్రోక్రోం పరిశ్రమ ఏర్పాటు చేశారు. గోపాల్‌పూర్ టాటా సెజ్‌లో మరో మూడు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి.

సేవలకు చిరునామా

ఆపత్కాలంలో సేవలకు చిరునామా టాటాస్టీల్ సామాజిక సేవల విభాగం (టీఎస్‌ఎస్‌ఎస్). 1999 అక్టోబరులో ఉత్తరకోస్తాలోని ఎరసమ వద్ద తీరాన్ని దాటిన ప్రచండ తుపాను సృష్టించిన విలయంలో టీఎస్‌ఎస్‌ఎస్ బాధితులకు అండగా నిలిచింది. 2019లో పూరీని తాకిన ఫొని తుపాను విధ్వంసం సృష్టించింది. అప్పట్లోనూ టాటా సేవల విభాగం మానవత్వంతో బాధితులను ఆదుకొంది. ఇలాంటి ఇతర సమయాల్లోనూ రాష్ట్రంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు ఆపన్నహస్తం అందిస్తోంది.

ప్రభుత్వ కార్యక్రమాలకు అండ

గతంలో నవీన్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన కార్యక్రమాలకు టాటా కన్సల్టెన్సీ సహాయసహకారాలు అందించింది. పేదల నివాసాలకు స్థలాలు సమకూర్చే 'జగామిషన్' కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు నడిపించింది. కంపెనీ రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలో తరచూ రాష్ట్రానికి వచ్చిన రతన్ టాటాను ఉత్కళీయులు అమితంగా అభిమానించేవారు.

ప్రముఖుల సంతాపం

రతన్ టాటా మృతికి గవర్నరు రఘుబర్‌దాస్, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, బిజద అధినేత నవీన్ పట్నాయక్ తదితర ప్రముఖులు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా సంతాపం తెలిపారు. అలుపెరుగని శ్రమజీవిగా ఆయనను అభివర్ణించారు.



గోపాల్‌పూర్‌లోని టాటా ఫెర్రోక్రోం కర్మాగారం



కొవ్వొత్తులతో నివాళి

బ్రహ్మపురకు చెందిన రుబెన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి నివాళులర్పిస్తూ గురువారం సాయంత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. రామలింగం పార్కు హనుమాన్ విగ్రహం కూడలి నుంచి గాంధీనగర్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు.

- న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

కొద్ది రోజుల్లో
కొత్త రేషన్ కార్డులు: కృష్ణచంద్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కొద్ది రోజుల్లో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు ఆహారం, పౌరసరఫరాల శాఖా మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ చెప్పారు. గురువారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అనర్హులను జాబితా నుంచి తొలగించడానికి చేపట్టిన ఈకేవైసీ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇంతవరకు 2.30 కోట్ల మంది నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. మరో కోటి మందికి ప్రక్రియ జరుగుతోందని, ఇది 15 నుంచి 20 రోజుల్లో ముగుస్తుందన్నారు. తరువాత అర్హులందరికీ కొత్త కార్డులు అందుతాయన్నారు. పీఎం అన్నయోజన కార్యక్రమం 2028 వరకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

కొరాపుట్ - రాయగడ రైలుమార్గంలో
జారిపడిన రాళ్లు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్-రాయగడ రైలుమార్గంలో గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు సొరంగం నుంచి రాళ్లు జారిపడి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొద్దిసేపటిలో రవుర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ మార్గం మీదుగా వెళ్లవలసి ఉండగా దీనికి ముందే రాళ్లు పడడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే అధికారుల వివరాల మేరకు... కేఆర్ రైల్వే మార్గంలో కకిరి గుమ్మ - లక్ష్మీపూర్ రైల్వే స్టేషన్ మధ్యలో సొరంగం 3లోని 58 కి.మీ. పాయింట్ వద్ద ఒక్కసారిగా బండరాళ్లు పట్టాలపై పడ్డాయి. ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ వైర్ తెగిపోయింది. ఆ సమయంలో రవుర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ మార్గంలో వెళ్లాల్సి ఉండగా కొద్ది దూరంలో నిలిపేశారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్తు లైన్లు కూడా తెగిపోయాయి. దీంతో కొరాపుట్ రాయగడ రైల్వే ట్రాక్‌పై ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కొరాపుట్ నుంచి నిపుణుల బృందం ఘటనా స్థలానికి చేరుకుని రైల్వేట్రాక్‌పై రాళ్లను తొలగించారు. ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మరమ్మతులు చేసి పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ రిపేర్ చేసిన తర్వాత రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి.



సొరంగంలో రైల్వే ట్రాక్‌పై పడిన రాళ్లు

చెరువులో మునిగి అక్కాచెల్లెలు మృతి



రాజ్యలక్ష్మి బెహరా



భాగ్యలక్ష్మి బెహరా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: చెరువులో మునిగి అక్కాచెల్లెలు మృతి చెందిన ఘటన బాలేశ్వర్ జిల్లాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలేశ్వర్ జిల్లా సోరో పోలీస్‌స్టేషన్ పరిధి ఖరాసహపూర గ్రామానికి చెందిన మానస బెహరా కుమార్తెలు రాజ్యలక్ష్మి (16), భాగ్యలక్ష్మి (13) బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామంలోని చెరువుకు స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయారు. ఎంతసేపటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. చెరువు వద్ద ఉన్న చెప్పులు చూసి స్థానికుడు బాధిత కుటుంబానికి సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి వచ్చిన తల్లిదండ్రులు అవి తమ కుమార్తెలవేనని గుర్తించారు. గ్రామస్థుల సహకారంతో చెరువులో గాలించి ఇద్దరినీ వెలికితీశారు. సోరో ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారిద్దరూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియమ, నిష్ఠలతో దుర్గాష్టమి పూజలు



మార్తాపేటలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారి అలంకరణ



మొహుడా గ్రామంలోని మా భైరవి అమ్మవారు

గంజాం జిల్లాలోని వివిధ శక్తిపీఠాలు, తాత్కాలిక దుర్గాపూజా మండపాల్లో గురువారం దుర్గాష్టమి పూజలను నియమ, నిష్ఠలతో ఆచరించారు. ఆయాచోట్ల విశేష పూజలు, హోమాలు, చండీ స్తోత్ర పారాయణాలు నిర్వహించి అమ్మవార్లకు శ్రీ మహాదుర్గ అవతారాలతో అలంకరించారు.

- న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



మహా దుర్గ అవతారంలో శ్రీ రేవణ సిద్ధేశ్వర స్వామి మందిరంలోని అమ్మవారు

కాత్యాయని రూపం... భక్తులకు మోదం

శరన్నవరాత్రుల నేపథ్యంలో శక్తిపీఠాల్లో గురువారం ఉదయం సప్తమి, మధ్యాహ్నం అష్టమి సేవలు నిర్వహించారు. సుప్రసిద్ధ కటక్ చండీ ఆలయంలో అమ్మ బగళాముఖి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. జాజ్‌పూర్‌లోని బిరజా అమ్మవారు కాత్యాయని రూపంలో కొలువుదీరారు. అష్టమి పూజల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆయాచోట్ల వ్రతాలు చేపట్టారు. సుమంగళి నోములు నోచుకున్నారు.

- న్యూస్‌టుడే, భువనేశ్వర్



బగళాముఖి అవతారంలో కటక్ చండీ



కాత్యాయని రూపంలో బిరజా అమ్మ



భువనేశ్వర్ జయదేవ్ విహార్ పెండాల్‌లో దేవీ



కటక్ తెలగ బజార్‌లో ఏర్పాటైన విగ్రహం



కటక్ ఒడియా బజారులో వెండి ధగధగల్లో అమ్మవారు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్, కటక్ జంట నగరాల్లో విజయరూపిణి దుర్గమ్మల నిలువెత్తు విగ్రహాలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కటక్‌లో 16 చోట్ల వెండితో అమ్మలను అలంకరించారు. విద్యుత్తు కాంతుల్లో విగ్రహాలు తళుక్కుమంటున్నాయి. దేవీ పీఠాల్లో చండీ స్తోత్ర పారాయణాలు జరుగుతున్నాయి. సందర్శకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కమిషనరేట్ పోలీసు యంత్రాంగం పెండాళ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చేపట్టింది.

దంపతుల ఆత్మహత్య



సుమన్



సుమిత్ర

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో దంపతుల ఆత్మహత్య కలకలం రేపింది. టౌన్ ఐఐసీ రమణి రంజన్ దొళాయి తెలిపిన వివరాల ప్రకారం... బామునిపుట్ ప్రాంతానికి చెందిన సుమన్ (25), సుమిత్ర (21) గురువారం ఇంట్లో పంకాకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం వీరికి వివాహమైంది. ఆర్థిక సమస్యలతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మృతదేహాలను పరీక్షలకు పంపించామని, నివేదిక వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని ఐఐసీ రమణి రంజన్ దొళాయి తెలిపారు.

ఆకాంక్ష జిల్లాలకు ఐఏఎస్ అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 16 'ఆకాంక్ష' జిల్లాలకు కార్యదర్శి హోదా గల సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించింది. నీతి ఆయోగ్ సూచనల మేరకు... అధికారులు ఆయా జిల్లాలు, సమితుల్లో అమలవుతున్న కార్యక్రమాలు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. అధికారుల వివరాలివీ....

అధికారి	జిల్లా
హేమంత శర్మ	కేంఝర్
సుశీల్‌కుమార్ లోహానీ	కలహండి
సుశీల్‌కుమార్	మల్కాన్‌గిరి
చిత్ర అర్ముగం	కొరాపుట్
శాశ్వత మిశ్ర	బరగఢ్
ఉషాపాఢి	కొంధమాల్
వీర్‌విక్రం యాదవ్	బొలంగీర్
విశాల్‌కుమార్ దేవ్	నువాపడ
సంజయ్‌కుమార్ సింగ్	మయూర్‌భంజ్
శోభా శర్మ	గజపతి
భాస్కరజ్యోతి మిశ్రా	నవరంగపూర్
శాలినీ పండిత్	రాయగడ
అశ్వని. ఎస్	సుందర్‌గఢ్
అరవిందఅగ్రవాల్	సంబల్‌పూర్
ఎన్. తిరుమల నాయక్	నయాగఢ్
సుధాంశుమోహన్ సామల్	ఢెంకనాల్

ఈ 16 మంది కార్యదర్శులు తమకు కేటాయించిన జిల్లాల్లో తరచూ పర్యటిస్తారు. పాలనాధికారులతో కలిసి పనుల ప్రగతి సమీక్షిస్తారు. జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తారు.

ప్రభుత్వ నిర్ణయం..
- 12 ఆదివాసీ జిల్లాల్లో మూతపడిన పౌష్టికాహార కేంద్రాలు

గిరిజన చిన్నారులకు శాపం



రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఆదిమ గిరిజన తెగలకు చెందిన చిన్నారులు, మాతృమూర్తులకు పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో గతంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార కేంద్రాలపై ప్రభుత్వం తాజా నిర్ణయం వారికి శాపంగా మారుతోంది. అక్టోబర్ 1 నుంచి 12 జిల్లాల్లో వీటిని మూసివేస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం సర్కార్ ప్రకటించిన నేపథ్యంలో ఈ అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒడిశా పీవీటీజీ పోషకాహార అభివృద్ధి ప్రోగ్రాం (ఓపీఎన్ఐపీ) కింద పథకం అమలు చేస్తున్నారు. ఇప్పుడు వీటి మూతవేతతో గిరిజన చిన్నారులకు పౌష్టికాహారం ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనిపై ఇప్పటికే మండిపడుతున్న జనస్వాస్థ్య అభియాన్, లోక్‌శక్తి అభియాన్, ఒడిశా ఖాద్యో అధికార్ అభియాన్ సంస్థలు తాజాగా సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సర్కార్ నిర్ణయంతో ఆదిమ గిరిజన చిన్నారులకు పౌష్టికాహారం అందేదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అందులో పేర్కొన్నాయి. 12 ఆదివాసీ జిల్లాల్లోని 89 పంచాయతీల్లో అమలు చేసిన ఈ కేంద్రాల ద్వారా గిరిజన చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ తదితర సేవలు సమకూరేవని ఆ ప్రకటనలో వెల్లడించాయి.

13 పీవీటీజీలపై ప్రభావం

12 జిల్లాలోని 13 ఆదిమ గిరిజన తెగలకు (పీవీటీజీ) చెందిన 0-6 ఏళ్ల చిన్నారులు, మాతృమూర్తుల కోసం ఆహార కేంద్రాల (ఫీడింగ్ సెంటర్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2021లో అప్పటి బిజద సర్కార్ రాయగడ, మల్కాన్‌గిరి, గజపతి, కలహండి, నువాపడ, సుందర్‌గఢ్, దేవగఢ్, అనుగుల్, మయూర్‌భంజ్, కేంఝర్, గంజాం, కొంధమాల్ జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేశారు. సర్కార్ తాజా నిర్ణయంతో పీవీటీజీ జాబితాలో ఉన్న డొంగిరియా కొంధో, లంజియా సవర, బిర్హోర్, బొండా, చుక్టియా, బుంజియా, దిడయి, హిల్ ఖరియ, జువాంగ్ కుటియా కొంధో, లొధొయంకిర్దియా, పవుడి భుయా, సవర తెగలపై ప్రభావం చూపనుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పైన పేర్కొన్న 12 జిల్లాల్లో 61 ప్రత్యేక కేంద్రాలు, మరో 272 చిన్నారుల, మాతృమూర్తుల ఆహార కేంద్రాలను రాష్ట్ర సర్కార్ నిర్వహించినట్లు రికార్డులు పేర్కొంటున్నాయి.

వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర క్రీడాకారులకు పతకాల పంట



పసిడి, రజతపతకాలతో స్నేహా సొరెన్



పసిడి, రజతపతకాలతో రిమాభొయి



బంగారు పతకంతో మీనాశాంత



రజతపతకంతో కుల్‌దీప్ సాహు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. రెండు రోజుల్లో వివిధ విభాగాల్లో నలుగురు రాష్ట్ర లిఫ్టర్లు తొమ్మిది పతకాలు చేక్కించుకున్నారు. ఒడిశా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ గురువారం ఆ వివరాలను 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు. మహిళల 55 కిలోల విభాగంలో స్నేహ సొరెన్ స్నాచ్, క్లీన్‌జర్కలలో మొత్తం 191 కిలోల బరువులెత్తి 3 బంగారు, ఒక రజత పతకం గెలుచుకుంది. 59 కిలోల సీనియర్ విభాగంలో రిమాభొయి స్నాచ్, క్లీన్‌జర్కలలో మొత్తం 198 కిలోల బరువులెత్తి ఒక పసిడి, ఒకరజత పతకం కైవశం చేసుకుంది. 55 కిలోల యువ, జూనియర్ విభాగాల్లో మీనాశాంత స్నాచ్, క్లీన్‌జర్కలలో మొత్తం 176 కిలోల బరువులెత్తి 2 బంగారు పతకాలు గెలుచుకోగా, 73 కిలోల విభాగంలో కుల్‌దీప్‌సాహు స్నాచ్, క్లీన్‌జర్కలలో మొత్తం 276 కిలోల బరువులెత్తి ఒక రజత పతకం దక్కించుకున్నారు.

గజరాజును కాపాడిన అటవీ సిబ్బంది



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కలహండి జిల్లా నర్లా అటవీరేంజ్ పరిధిలోని జమపడ వద్ద పాడైన బావిలో బుధవారం రాత్రి గజరాజు పడిపోయింది. వెలుపలికి రాలేక ఘీంకారాలు చేసింది. గురువారం గమనించిన ప్రజలు అటవీ అధికారులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది క్రేన్ సాయంతో మూడు గంటలపాటు శ్రమించి ఏనుగుకు గాయాలు కాకుండా బయటకు తీశారు. వెలుపలికి వచ్చిన తర్వాత అది వడివడిగా అడవివైపు వెళ్లిపోయింది.

రంగులు మార్చి ఏం ప్రయోజనం?

విపక్షాల ఎద్దేవా... సమర్థించుకున్న భాజపా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మోహన్‌చరణ్ మాఝి ప్రభుత్వం కార్యాలయాలు, అతిథి భవనాల రంగులు మార్చాలని తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశమైంది. దీనివల్ల ఒరిగేదేమిటి? ప్రజలకేంటి ప్రయోజనమంటూ విపక్షాలు నిలదీస్తున్నాయి. దిగజారుడు రాజకీయాలకు నిలువుటద్దమని ఎద్దేవా చేస్తున్నాయి.

నారింజ రంగు


ప్రజాపనుల శాఖ ఒడిశా బ్రిడ్జ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఓబీసీసీ)కు జారీ చేసిన ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ఇతర భవనాలన్నింటికీ నారింజ రంగు వేస్తారు. అంచులకు (బోర్డర్) ఎరుపు ఉంటుంది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ కొనసాగిస్తున్న భాజపా పాలకులు వాటి పేర్లు మార్చారు. కొత్తగా ప్రారంభించినవేవీ లేవు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవాటిలో సుభద్ర మహిళల సొమ్ము పంపిణీ మినహాయిస్తే మిగతావేవీ పట్టాలకెక్కించలేదు. ప్రస్తుతం కార్యాలయ భవనాలకు రంగులు మార్చాలన్న నిర్ణయం రాజకీయ ఉద్దేశం కావచ్చని పరిశీలకులంటున్నారు. 2010లో నాటి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అంతా హరిత (ఆకుపచ్చ) రంగు చేయించింది. బిజద నాయకులంతా ఆకుపచ్చ కండువాలు ధరించి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో భాజపా అధికారంలోకి వచ్చిన తరువాత కాషాయం రంగులు వేయించడానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి.

ఎవరికి ప్రయోజనం?



శాసనసభలో బిజద ఉపనేతగా వ్యవహరిస్తున్న **ప్రసన్న ఆచార్య** బుధవారం రాత్రి సంబల్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... సున్నాలు, రంగులు మారిస్తే ప్రజలకేంటి ప్రయోజనమని ప్రశ్నించారు. భాజపా నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బిజద అమలు చేసిన పథకాల పేర్లు మార్చిన వారు కార్యాలయ భవనాల రంగులు మార్చి సాధించేదేమీ లేదని, భాజపా నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు.

మతతత్వం వారి రంగు



పీసీసీ మాజీ అధ్యక్షుడు **జయదేవ్ జెనా** గురువారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... మతతత్వం రంగు పులుముకున్న భాజపా నేతలకు లౌకికవాదం గురించి తెలియదన్నారు. వందరోజుల పాలనలో రాష్ట్రంలో మెరుపులు మెరిపిస్తామన్నవారు పేర్లు, రంగులు మార్చే పనులకే పరిమితం అయ్యారన్నారు.

నవీన్ సమాధానం చెప్పాలి




ప్రజా పనులు, న్యాయశాఖల మంత్రి **పృథ్వీరాజ్ హరిచందన్** గురువారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాలకు గతంలో నారింజ రంగు ఉండేదని, గత ప్రభుత్వం రంగు మార్చిందన్నారు. దీనికి నవీన్ పట్నాయక్ జవాబుదారీ అన్నారు. నారింజ రంగు శుభకరమని, దూరదృష్టితో నిర్ణయం తీసుకున్నట్లు సమర్థించుకున్నారు.

కొరాపుట్ జిల్లాలో
తెలుగు సినిమా చిత్రీకరణ



సిమిలిగుడలో హోటల్‌లో జగపతిబాబు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ముఖ్య పర్యాటక ప్రాంతంగా కొరాపుట్ జిల్లా గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకుల తాకిడి పెరిగింది. తాజాగా సినీ పరిశ్రమ దృష్టి ఈ ప్రాంతంపై పడింది. ప్రస్తుతం తెలుగు సినిమా చిత్రీకరణ కొద్ది రోజులుగా జరుగుతోంది. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై వై. రాజీవ్‌రెడ్డి, జే. సాయిబాబు దీన్ని నిర్మిస్తుండగా క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాన పాత్రలో అనుష్క శెట్టి నటిస్తోంది. ప్రముఖ నటుడు జగతిబాబు, నటి రమ్యకృష్ణ, విక్రమ్ ప్రభు తదితరులు నటిస్తున్న చిత్రం షూటింగ్ గతవారం రోజులుగా జరుగుతుంది. జిల్లాలోని లమతపుట్, ఒనకడిల్లి, దేవ్‌మాలి పరిసర గిరిజన గ్రామాల్లో, సిమిలిగుడ ప్రాంతంలో కొన్ని కీలకమైన దృశ్యాలు చిత్రకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలో అన్ని హోటళ్లు, లాడ్జిలు సినిమావారితో నిండిపోయాయి. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రం ఉత్తరాంధ్ర నేపథ్యంలో ఉంటుందని, గంజాయికి సంబంధించి కథతో చిత్రం నిర్మిస్తున్నామని చిత్రయూనిట్ తెలిపింది. కథ వివరాలు వెల్లడించలేమని, తమ చిత్రానికి ఈ ప్రాంతం అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని, మరిన్ని చిత్రీకరణలు జరుగుతాయని నిర్మాత రాజీవ్ రెడ్డి చెప్పారు. నటీనటులను చూసేందుకు స్థానికులు ఎగబడుతున్నారు. ఈ చిత్రంలో సునాబెడ హాల్ టౌన్‌షిప్‌కు చెందిన దేవికా ప్రియదర్శిని, సిమిలిగుడకు చెందిన ఏ. రక్షిత్, కామేష్ తదితరులు నటించే అవకాశం వచ్చింది. గత ఫిబ్రవరిలో కొంత చిత్రీకరించగా మిగిలిన భాగం ఇప్పుడు తీస్తున్నారు.



చిత్రంలో నటిస్తున్న స్థానిక నటి ప్రియదర్శిని

ఆకుకూరలతో కళ్లకు మేలు...

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితిలో బాగుసల, గురండి, లావణ్యగడ ఆరోగ్య కేంద్రాల్లో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వైద్యులు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. బాగుసల ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు రజాత్‌శెరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్లపై దృష్టి చూపాలని, ఆకుకూరలు ఎక్కువగా తినాలన్నారు.


బాగుసలలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు

మత్స్యకారులకు పరికరాల పంపిణీ


కొత్త పడవపై కూర్చున్న ఎంపీ బలభద్ర మాఝి, తదితరులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి బలిమెల జలాశయం మత్స్యకారులకు పడవ, వల, లైఫ్ జాకెట్ల పంపిణీ చేశారు. గురువారం చిత్రకొండలోని బలిమెల జలాశయంలో నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖిల పాల్గొని 40 నాటు పడవలు, 150 వలలు, 80 లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి ఖిల, జిల్లా పరిషత్ సభ్యురాలు బినంతి ఖిల తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మపురలో చైతన్య ర్యాలీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే గంజాం జిల్లా సమరఝెళొలోని శంకర కంటాసుపత్రి ఆధ్వర్యంలో ఛత్రపురం రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ సహకారంతో 'ప్రపంచ దృష్టి దినోత్సవం' సందర్భంగా గురువారం ఛత్రపురంలో చైతన్య ర్యాలీ జరిగింది. పట్టణంలోని మా రామాయణమ్మ మందిరం వద్ద ప్రారంభమైన ఇది ప్రధాన రహదారుల్లో సాగింది. 'కళ్లను ప్రేమించండి.. తరచూ పరీక్షలు జరుపుకుంటూ వాటిని కాపాడండి' అని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఆనందరామన్, బి.శ్రీనివాస్, శుభమ్ పాణిగ్రహి, నళినీ రౌత్, స్మితా బెహరా, ఎం.ధనుంజయ రెడ్డి, సుజిత్ సామంత్రాయ్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

రైతులకు స్ఫూర్తిగా ఉల్లాస్


సాగుతో యువ రైతు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితికి చెందిన యువరైతు ఉల్లాస్ వర్షాకాలంలో కుఫ్రీజ్యోతి బంగాళదుంప సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో 15 క్వింటాళ్ల కుఫ్రీజ్యోతి రకం దుంపలు నాటి 52 క్వింటాళ్ల దీని నుంచి సాధించాడు. ఈ సాగుకు సేంద్రియ ఎరువులను ఉపయోగించినట్లు తెలిపారు. భవిష్యత్తులో దుంపల విత్తనాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాడు. ఉల్లాస్ బంగాళదుంపల సేద్యంతో రాణించి మరి కొంతమందికి స్ఫూర్తిగా నిలిచినట్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మురళీ చెప్పారు.

లఘు చిత్రాలపై శిక్షణ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠ్యేతర అంశాలపై అవగాహన పెంచుకోవాలని, చదువుతోపాటు తమకు ఆసక్తి గల రంగాల్లో రాణించేలా కృషి చేయాలని అంతర్జాతీయ అవార్డులు సాధించిన లఘు చిత్ర యువ దర్శకుడు కృష్ణ డీకే అన్నారు. గంజాం జిల్లా అంకుశపూర్‌లోని శిక్ష్యా కళాశాలలో బుధవారం లఘు చిత్రాలు రూపొందించడంపై శిక్షణ శిబిరం ఏర్పాటైంది. ఇందులో పాల్గొన్న ఆయన వీటి చిత్రీకరణలో వివిధ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన దర్శకత్వం వహించిన పలు లఘు చిత్రాల్ని పెద్ద తెరపై ప్రదర్శించారు. నిర్వాహక విద్యా సంస్థ అధ్యక్షురాలు కె.జూలీరాణి పాత్రో, ప్రధానాచార్యుడు మానస్ రంజన్ శత్పధి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణ డీకే. చిత్రంలో ఇతరులు

బిజద వీడిన ప్రకాష్ బెహరా



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ జిల్లా సాలేపూర్ మాజీ శాసనసభ్యుడు ప్రకాష్ బెహరా గురువారం సాయంత్రం బిజదకు రాజీనామా చేశారు. దీనిపై పార్టీ అధినేత నవీన్ పట్నాయక్‌కు రాజీనామా లేఖ పంపించారు. కారణాలు వెల్లడించలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన సాలేపూర్ నుంచి పోటీ చేయాలని భావించారు. నాయకత్వం ఆయనకు కటక్-బారాబటి సీటు కేటాయించింది. అక్కడి నుంచి పోటీ చేసిన ఆయన పరాజయం చవిచూశారు. కొన్నాళ్లుగా అసంతృప్తిగా ఉన్న ప్రకాస్ బిజదతో సంబంధాలు తెంచుకున్నారు. 2014లో ఆయన సాలేపూర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి శాసనసభకు ఎన్నికయ్యారు. తరువాత బిజదలో చేరారు.

బీఈవోపై డీఈవోకు ఫిర్యాదు


డీఈవోకి వినతి పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తుల (యూనిఫామ్) సరఫరాకు ఆదేశాలు ఇచ్చేందుకు బీఈవో లంచం అడుగుతున్నారని ఆరోపిస్తూ గురువారం స్వయం సహాయక బృందం డీఈవోను కలిసి వినతి పత్రం అందజేశారు. నవరంగపూర్ జిల్లా పపదహండి సమితిలో 20 పాఠశాలలకు చెందిన ఏకరూప దుస్తులు సరఫరా చేసేందుకు బండారుఘరాని స్వయం సహాయక బృందానికి అప్పగించారు. వీటిని అందించేందుకు బీఈవో సోమేంద్ర భూమియను అనుమతి కోరగా ఒక్కొక్క యూనిఫాంకి రూ. 50 చొప్పున ఇవ్వాలని డిమాండు చేశారు. దీంతో ఆ బృందం కేవలం అయిదు పాఠశాలలకు సరఫరా చేసి మిగిలినవి బయట వ్యాపారులకు అప్పగించామని వాపోయారు. ఈ మేరకు డీఈవో ఛత్రపతి సాహుకు వినతి పత్రం అందజేశారు. దీనిపై విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీఇచ్చారు.

చల్లగా చూడమ్మ.. దుర్గమ్మ


గుణుపురం: ముత్యాలమ్మ అమ్మవారు..

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండపాలు విద్యుత్తు కాంతులతో మెరిసిపోతున్నాయి. పలు చోట్ల దాండియా ఆటలు, ప్రత్యేకపూజలు, హోమాలు జరిగాయి. దశమినాడు ఖరగ్‌పూర్ కొత్తకోళీ రావణ మైదానంలో రావణుడి దశకంఠుని దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేపట్టనున్నారు. దేశానికి సేవ చేయడమే ఆరెస్సెస్ లక్ష్యమని, దేశ భక్తి తొలి ప్రాధాన్యమని అతిథులు అన్నారు. సంఘం బ్రహ్మపుర శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– న్యూస్‌టుడే, బృందం


రాయగడ: సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు, భక్తులు


బ్రహ్మపుర: విజయదశమి వేడుకల్లో పాల్గొన్న అతిథులు


ఖరగ్‌పూర్: దశకంఠుని దిష్టిబొమ్మ


పర్లాఖెముండి: బట్టి సిరిపురంలో పత్రికొమ్మలు పొలానికి తీసుకెళ్తున్న రైతులు


ఖరగ్‌పూర్‌లో ఆకర్షణీయమైన మండపాలు.


జయపురం : డాండియా ఆడుతున్న తారాప్రసాద్ మీనాక్షి, బాహినిపతి

కూరగాయల ధరలతో బెంబేలు


దుకాణంలో కూరగాయల అమ్మకాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా పెరుగుతున్న కాయగూరల ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పండగ వేళ వీటి ధరలు మరింత పెరగడంతో తారుమారైన వంటింటి బడ్జెట్‌తో తలలు పట్టుకుంటున్నారు. గంజాం జిల్లాలో పండిస్తున్న కాయగూరలు ప్రజలు అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో వ్యాపారులు, ఆంధ్రా కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి పలు రకాల కాయగూరలు దిగుమతి చేసుకుంటున్నారు. బ్రహ్మపురలోని చిల్లర బజారులో గురువారం టమాటా కిలో రూ.80లు పలకగా, క్యాలీఫ్లవర్, బీన్స్ కిలో రూ.100లకు విక్రయిస్తున్నారు. ఉల్లి కిలో రూ.60, బంగాళా దుంపలు రూ.35, గాజర్ రూ.60, వంకాయలు, రూ.50, బీరకాయలు రూ.50, బెండకాయలు కిలో రూ.50లకు అమ్మకాలు జరుపుతున్నారు. విజయదశమి రోజున వాహనాలు, ఇతరత్రా పూజలకు దోసకాయల్ని ఉపయోగిస్తుంటారు. దీంతో ఇవి కిలో రూ.80ల ధర పలికింది.

ఉత్సవాలకు పోలీసుల బందోబస్తు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; జిల్లాలో ఘనంగా జరిగే జేకేపూర్ దసరా నవరాత్రి ఉత్సవాలకు 5 ప్లటూన్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ బికే మహపాత్రో గురువారం పాత్రికేయులకు తెలిపారు. శాంతిభద్రతలు కాపాడమే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ముందు జాగ్రత్త చర్యగా రాత్రివేళ వాహనాల తనిఖీలు చేపడతమన్నారు.

చర్యలు తీసుకుంటాం..

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సాహిత్య పరివార్ సభ్యులు జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్‌కి వినతి పత్రం అందచేశారు. కొరాపుట్‌లోని ప్రముఖ రచయిత, కవి గోపినాథ్ మొహంతి నివాసాన్ని ప్రత్యేకంగా గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు డా.ప్రీతిధర సమల్, రబీ తదితరులు ఉన్నారు.

మళ్లీ పరీక్షలు నిర్వహించాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో ఆర్.ఐ., ఏఆర్ఐ, అమీన్‌ల నియామకాలకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆఫ్‌లైన్‌లో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండు చేస్తూ గురువారం కటక్‌లో వందలాది మంది యువతీ యువకులు ర్యాలీగా పాలనాధికారి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు.

హర్షితకు సన్మానం


హర్షితకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కొరాపుట్ పోస్టల్ డైరెక్టర్

జయపురం, న్యూస్‌టుడే: జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా కొరాపుట్ తపాలాశాఖ ఆధ్వర్యంలో రచన పోటీలు నిర్వహించారు. జయపురం ప్రకాష్ పాఠశాల 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని హర్షిత ప్రియదర్శిని మెహంతి రాష్ట్ర స్థాయిలో రెండోవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం కొరాపుట్ తపాలా డైరెక్టర్ ఆమెకు ప్రశంసాపత్రం, రూ.10వేలు నగదు అందజేశారు. హర్షిత వ్యవసాయధారిత జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేస్తూ ఇప్పటికే వివిధ అవార్డులను అందుకుంది.

కొండెక్కిన సంకేతాలు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం గ్రామీణ ప్రాంతాల్లో సంకేతాలు అందక స్థానికులు ఫోన్ మాట్లాడేందుకు కొండ ఎక్కుతున్నారు. ఈ సమితిలో చిన్నాసరి పంచాయతీ కుటుని, రుంబాతి, పొదాసహి తదితర గ్రామాల్లో ఈ సమస్య వెంటాడుతోంది. ప్రభుత్వ పథకాల నమోదు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జయపురంలో ప్రాజెక్టుల ప్రారంభోత్సవం


లక్ష్మీనగర్ వద్ద ఉద్యానవనం ప్రారంభిస్తున్న శాసనసభ్యుడు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పురపాలిక తరపున బుధవారం సాయంత్రం పట్టణంలో శాసనసభ్యుడు తారాప్రసాద్ బాహినిపతి మూడు ప్రాజెక్టులు ప్రారంభించారు. పూర్ణగూడలో నిర్మించిన ఉద్యానవనం, లక్ష్మీనగర్‌లో పిల్లల ఉద్యానవనంతోపాటు పెద్దలకు ఓపెన్ వ్యాయామశాల, కొవిడ్ ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్ ప్రారంభించారు. వీటికి రూ.80 లక్షలు వెచ్చించినట్లు ఈవో సిద్ధార్థ్ పట్నాయక్ తెలిపారు. పురాధ్యక్షుడు నరేంద్ర మొహంతి, బీడీవో శక్తి మహాపాత్రో, ఉపాధ్యక్షురాలు బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల దారి మళ్లింపు


పరుల్ పట్వారి, జిల్లా పాలనాధికారి

రాయగడ, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి 10 కి. మీ దూరంలో ఉన్న పారిశ్రామికవాడ జేకే పూర్‌లో దుర్గా పూజల్లో భాగంగా రావణ దహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భారీ వాహనాల దారి మళ్లించినట్లు జిల్లా పాలనాధికారి పరుల్ పట్వారి తెలిపారు. రద్దీ దృష్ట్యా రాయగడ మీదుగా వెళ్లే భారీ వాహనాలు కొత్తపేట నుంచి అమలాపేట, మల్లిగాం వైపుగా వెళ్లనున్నాయి.

రహదారిపై తనిఖీలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలో పట్టణంలో దసరా ఉత్సవాలు సందర్భంగా గురువారం పోలీసు శాఖ తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమతి లేని ప్రాంతాల్లో నిలిపిన 50 వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ఐఐసీ రమణి రంజన్ దొళాయి మాట్లాడుతూ ఉత్సవాలు పూర్తియ్యే వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు

పేద పిల్లలకు పండగ


పండగ ఆనందంలో పేద పిల్లలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగపూర్ సెయింట్ జాన్ అంబులెన్స్ సంస్థ పేదపిల్లల కళ్లలో ఆనందం నింపింది. గురువారం వారికి భోజనాలు ఏర్పాటు చేసింది. కొత్త దుస్తులు అందించి ప్రత్యేక వాహనంలో పట్టణంలో ఏర్పాటైన పలు దుర్గా మండపాలను చూపించింది. ఈ బృందానికి పలువురు ప్రశంసిచారు.

నిర్వాసిత గ్రామాల అభివృద్ధిపై దృష్టి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నాల్కో కర్మాగారం ఏర్పాటుతో సర్వస్వం కోల్పోయిన నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలని సీపీఎం నేత, పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం కోరారు. దమన్‌జోడీలో నాల్కో పంచ పటమాలి పర్వతంపై ఉన్న హిల్ టాప్ వద్ద గల గనుల ప్రాంతాన్ని గురువారం ఎమ్మెల్యే కడం పర్యటించారు. ఇక్కడ పనులు ఏ విధంగా సాగుతున్నాయో అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం వీటి తవ్వకాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని గనుల శాఖ జనరల్ మేనేజర్ ఎల్ వీ ప్రసాద్ హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ సభ్యులు మెహర్ కూల్ దీప, సిమిలిగుడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా మజ్జి, నేతలు పీతాంబర్ కీర్షని, నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.


హిల్ టాప్‌లో గనుల ప్రాంతాన్ని పర్యటించిన ఎమ్మెల్యే కడం తదితరులు

అభాగ్యుల ఆశా దీపం రతన్ టాటా

రాయగడ, న్యూస్‌టుడే: కొట్లాది మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు రోగులకు సేవలు, పేదల సంక్షేమానికి కృషి చేసిఅభాగ్యుల ఆశా దీపంలా నిలిచిన రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని వక్తలు అన్నారు. గురువారం జిల్లా అతిథి గృహం (సర్క్యూట్ హౌస్)లో రాయగడ నాగరిక మంచ్ స్వచ్ఛంద సంస్థ సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న రాయగడ నాగరిక మంచ్ సభ్యులు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రారంభం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పట్టణంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఆశిష్ పాత్రో, ప్రాంతీయ చీఫ్ మేనేజర్ రతికాంత్ బెహరా పాల్గొన్నారు. దీంతో పాటు బ్యాంక్ పరిసరాల్లో ఏటీఎం ఏర్పాటు చేశారు.


కార్యక్రమంలో అతిథిలు

ప్లాస్టిక్ పూల దండలకు గిరాకీ

రాయగడ, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఇళ్లతో పాటు వాహనాలకు అలంకరించేందుకు రంగు రంగు ప్లాస్టిక్ పూల మాలలు అందుబాటులోకి వచ్చాయి. రాయపూర్, రాంచీ వంటి ప్రాంతాల నుంచి వచ్చిన వర్తకులు ప్రధాన కూడళ్లలో విక్రయిస్తున్నారు. వీటిని కొనేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

ఉరేసుకుని ఖైదీ ఆత్మహత్య

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ మండల జైల్లో ఓ ఖైదీ గురువారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొరాపుట్ ఎస్‌డీపీఓ శ్రావణినాయక్ అందించిన వివరాల మేరకు మల్కాన్‌గిరికి చెందిన నంగామడి(70) ఓ హత్యా నేరంపై జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. కారాగారంలో నిరుపయోగంగా ఉన్న గదిలో దూలానికి విద్యుత్తు తీగతో ఉరేసుకున్నాడు. కొంతమంది ఖైదీలు చూసి జైలర్‌కు సమాచారం అందించారు. అధికారులు కొరాపుట్ టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసును నమోదు చేసి మెజిస్ట్రేట్ సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. సహీద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి తరలించారు. పరీక్ష అనంతరం మృతదేహాన్ని బాధిత కుటుంబానికి అప్పగించినట్లు ఎస్‌డీపీఓ శ్రావణి తెలిపారు.

పోలీస్ కస్టడీలో నిందితుడి మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడు మృతి చెందడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే ఇటీవల కొత్తకోళికి చెందిన పదేళ్ల బాలుడు మనోజిత్‌సింగ్ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో బాలుడి అక్క లిజా సింగ్, ఆమె ప్రియుడు సోను కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. వారిని ఎనిమిది రోజులు రిమాండ్‌కు తరలించారు. ఇంతలో సోను బుధవారం మృతి చెందాడు. రిమాండ్‌లో ఉన్న నిందితుడు ఎలా మరణించాడని పోలీసులు వివరాలు వెల్లడించలేదు. ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌ఛార్జి రాజీవ్ కుమార్ మీడియాకు తెలిపారు.

ఆటోను ఢీకొన్న బస్సు: ఆరుగురికి గాయాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ధారాకోట ఠాణా పరిధిలోని బరడాబిల్లి సమీపాన ఖొయిరాపల్లి చేపల గోదాము వద్ద బుధవారం ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన ఓఎస్ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. వారిని స్థానికులు అంబులెన్స్‌లో అస్కాలోని సబ్ డివిజనల్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రుల్లో తీవ్రంగా గాయపడ్డ ముగ్గుర్ని ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

★ కొంధమాల్ జిల్లా ఫుల్బాణీ సదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మణియా అడవుల్లో బుధవారం ముక్కలుగా నరికి ఉన్న ఓ మహిళ మృతదేహం కనిపించింది. మృతదేహం దాడికేజు గ్రామానికి చెందిన సరళ బెహరాదిగా గుర్తించారు. ఆమె భర్తే తన కుమార్తెను హతమార్చాడని ఫిరింగియా ఠాణా పరిధిలోని ఖజురిపడ గ్రామానికి చెందిన సరళ తండ్రి నబఘన బెహరా ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు.

★ గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని బధినువాపల్లి పంచాయతీలోని నూతన ఘుముసుర గ్రామానికి చెందిన ఇంజినీరింగు విద్యార్థి తుషార్ పాత్ర్ (17) విష సర్పం కాటేయడంతో బుధవారం మృతిచెందాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో తీవ్ర అస్వస్థతకు గురైన పాత్రోను కుటుంబ సభ్యులు చికిత్సకు కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం విష సర్పం కాటేసి ఉంటుందని పేర్కొని ఎమ్కేసీజీ ఆసుపత్రికి పంపించారు. అక్కడే చికిత్స పొందుతూ పాత్రో మృతిచెందగా, కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చికిత్స సక్రమంగా చేయకపోవడంతో మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

ఏఎస్పీని ఆశ్రయించిన బాధిత మహిళలు


ఎస్పీ కార్యాలయం వద్ద నిల్చున్న బాధిత కుటుంబీకులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితిలో గ్రూప్‌లోన్ పేరుతో 100 మందికి పైగా మహిళలను మోసం చేసి దాదాపు రూ. 50లక్షలు తల్లీ, కుమారుడు దోచుకున్నారని తెలిసిందే. ఈ మేరకు సదరు బాధితులు గురువారం ఏఎస్పీని బట క్రిష్ణ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవటంతో ఏఎస్పీని ఆశ్రయించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ బాధితులకు హామీ ఇచ్చారు.

బరువు బారెడు. .ధర మూరెడు



రెక్కాడితే కానీ కడుపు నిండని అమాయక ఆదివాసీల బతుకులు ఇంకా దీనావస్థలోనే ఉన్నాయనడానికి ఈమె కష్టమే ఉదాహరణ. గురువారం కడవంత గుమ్మడికాయని నెత్తిమీద పెట్టుకొని మోసుకొచ్చినా కొనే వారు బేరాలు ఆడటంతో దిక్కుతోచని స్థితిలో వీధుల్లో తిరిగి అమ్ముకుంటోంది. రూ వంద చెబితే దళారులు రూ.30కి అడుగుతున్నారని వాపోయింది.

–న్యూస్‌టుడే, రాయగడ


మానసిక స్థితిపై అవగాహన

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: నేటి తరం అన్ని చోట్ల ఒత్తిడిలకు గురవుతున్నారని, ఆనందంగా జీవించేందుకు సేవభావం కలిగిఉండాలని న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌల్ అన్నారు. కాశీనగర్ సమితి రాణిపేటలోని నియాతి మానసిక పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవల అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీనిపై విద్యార్థులు, సిబ్బంది, పలువురికి అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి బిమల్ రౌలో

అధ్వానంగా శవపరీక్ష కేంద్రం


పనికిరాని మొక్కల్లో పరీక్ష భవనం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో సిమిలిగుడ పరిధిలో కుందిలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి సంబంధించి శవపరీక్ష కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. అయిదేళ్లుగా కేంద్రం నిర్వహణ కొరవడింది. దీంతో పరీక్షలకు పొట్టంగి, కొరాపుట్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొరాపుట్, సిమిలిగుడ, పొట్టంగి సమితులకు సంబంధించిన 22 గ్రామపంచాయతీల గ్రామాల కోసం 12 ఏళ్ల కిందట కుందిలి ఆరోగ్య కేంద్రానికి కిలోమీటర్ దూరంలో దీన్ని నిర్మించారు. నిర్వహణ కరవై భవనం శిథిలస్థితికి చేరుకుంది. ప్రస్తుతం పశువుల శాలగా వినియోగిస్తున్నారు. ఇక్కడ పరీక్షలు చేసేందుకు సదుపాయం లేకపోవడంతో దూర ప్రాంతాలకు కి.మీ. మోసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు సక్రమంగా రహదారులు కూడా లేవు. ఈ విషయంపై కుందిలి ఆరోగ్య కేంద్రం అధికారి సందీప్ బెహరాను ప్రశ్నించగా ప్రస్తుతం కేంద్రాన్ని వేరే చోటుకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. లేని పక్షంలో భవనాన్ని బాగు చేసి వినియోగంలోకి తెస్తామని, పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ
నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన డ్రైవర్ తాతాజీ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్.రాయవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ బస్సు 36 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై విభీషణరావు బస్సును పరిశీలించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరానికి చెందిన బస్సు డ్రైవర్ ఎం.తాతాజీ, విశాఖపట్నానికి చెందిన ఐ.ఎస్.ఎన్.రాజు, ఒడిశాకు చెందిన కె.చంద్ర సబత్, రంజన్ పంగి తలకు గాయాలయ్యాయి. వీరితోపాటు విజయనగరానికి చెందిన ఎం.చాణక్య, కాకినాడకు చెందిన రత్నకుమార్, వరప్రసాద్, వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ, నూకరత్నం, ఉమామహేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. వీరందరినీ నక్కపల్లి సామాజిక ఆసుపత్రి, పెనుగొల్లు ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం పలువురు క్షతగాత్రులను విశాఖ తరలించారు. బస్సులో మిగిలిన ప్రయాణికులు వేరే బస్సుల్లో విశాఖపట్నం వెళ్లారు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.

యంత్రం తగిలి కార్మికుడు మృతి

కంచికచర్ల, న్యూస్‌టుడే : డోజరు యంత్రం తగిలి క్వారీ కార్మికుడు మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన దీపక్ దౌరి(19) మండలంలోని పరిటాలలో శర్వాణి ఇండస్ట్రీస్ క్రషర్‌లో డోజరు యంత్ర సహాయకుడిగా పని చేస్తున్నాడు. గురువారం అతను క్వారీలో పని చేస్తుండగా గమనించని డోజరు డ్రైవర్ యంత్రాన్ని వెనక్కి నడపడంతో దీపక్ దౌరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. డ్రైవరు అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు డోజరు డ్రైవర్ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ అటవీశాఖ ఆటల పోటీలకు జయపురం రేంజర్



పతకాలు చూపిస్తున్న సచిదానంద్

జయపురం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో ఈ నెల 16-20వ తేదీ వరకు జరగనున్న 27వ ఆల్‌ఇండియా ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్‌లో బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొనేందుకు జయపురం రేంజర్ సచిదానంద్ పరిడా ఎంపికయ్యారు.

జాతీయ కిడ్స్ ఒలింపియాడ్ ఛాంపియన్ దిబ్యాంశి



వేదికపై మంత్రి, పక్కన ప్రశంసాపత్రంతో దిబ్యాంశి

జయపురం, న్యూస్‌టుడే: జాతీయ కిడ్స్ ఒలింపియాడ్ ఛాంపియన్‌గా జయపురం దీప్తి కాన్వెంట్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న దిబ్యాంశి మిశ్ర నిలిచింది. జాతీయస్థాయిలో 158 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ఈమె మంచి మార్కులు సాధించి విజేతగా నిలిచింది. రాష్ట్ర కల్చరల్ ఫౌండేషన్ ఈ కార్యక్రమం నిర్వహించింది. భువనేశ్వర్‌లో భారతీయ విద్యాభవనంలో బుధవారం విద్యార్థినికి స్వర్ణ పతకం, ప్రశంసాపత్రాలను ఒలింపియాడ్ అధ్యక్షుడు గురుప్రసాద్ సోమేంద్ర అందజేశారు. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి బిజ్ఞ కిశోర్ త్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా క్రీడాకారులకు ప్రోత్సాహం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను రాష్ట్ర క్రీడావిభాగం సత్కరించింది. ఈమేరకు భువనేశ్వర్‌లోని కళింగమైదానంలో ఈ నెల 8న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో క్రీడాశాఖ అధికారులు బీకేస్వైన్, శైలేంద్రజెనా, ఒడిశా హాకీ సంఘం సీఈఓ దీపాంకర్ మహాపాత్ర్ అతిథులుగా హాజరై వివిధ క్రీడాంశాల్లో పతకాలు గెలుచుకున్న 72 మంది క్రీడాకారులకు మొత్తం రూ.3.85 లక్షల నగదు పారితోషికం అందజేశారు.



సత్కారం అందుకున్న క్రీడాకారులు. చిత్రంలో క్రీడావిభాగం అధికారులు

తూర్పుజోన్ అథ్లెటిక్ విజేత పశ్చిమబెంగాల్



విజేతలు పశ్చిమబెంగాల్ క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగమైదానంలో జరిగిన 35వ తూర్పుజోన్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఇందులో మొత్తం పోటీల్లో పశ్చిమబెంగాల్ అథ్లెటిక్ సంఘం పురుషులు, మహిళా క్రీడాకారులు ఛాంపియన్‌గా నిలిచారు. ఒడిశా జట్టు క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచారు. ముగింపు కార్యక్రమంలో ఒడిశా హాకీ సంఘం సీఈవో దీపాంకర్ మహాపాత్ర్, రాష్ట్ర క్రీడల శాఖ అదనపు కార్యదర్శి బీకేస్వైన్, సంయుక్త కార్యదర్శి శైలేంద్రజెనా విజేతలకు బహుమతులందజేశారు.

అంతర్ కళాశాలల చదరంగం విజేతలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం క్రీడల విభాగం, ఎస్‌బీఆర్ మహావిద్యాలయం (చికిటి) తరఫున రెండు రోజులు నిర్వహించిన 45వ అంతర్‌కళాశాల పురుషులు, మహిళా చదరంగం పోటీలు బుధవారం ముగిశాయి. చికిటి మహావిద్యాలయలో జరిగిన ఇందులో విశ్వవిద్యాలయ పరిధిలోని పలు ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు. తుదిపోరులో ఎమ్మెస్సీజీ కళాశాల, బ్రహ్మపుర వర్సిటీ పీజీవిభాగం, వినాయక ఆచార్య కళాశాల, చికిటి మహావిద్యాలయం, ఆదివాసీ కళాశాల (బలిగుడ)లకు చెందిన పదిమంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారు.



బహుమతులతో విజేతలు. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

ఘనంగా నవదుర్గ ఉత్సవాలు



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ జ్ఞాన సరస్వతీ ఆలయంలో సప్తమాతృక నవదుర్గ శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. 18 మంది ఉత్సవ మూర్తులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అఖిలాండేశ్వరి, పలు శక్తిపీఠాల ఉత్సవమూర్తులతో పాటు దేవీ అలంకరణలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ప్లాంటు ఉన్నా తప్పని పాట్లు..!

న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

తాగునీటికి విద్యార్థుల అవస్థలు

★ సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. గత ఐదు నెలలుగా అది పనిచేయడం లేదు. ఏదైనా సాంకేతిక లోపంతో మరమ్మతులకు గురైతే సంబంధిత నిపుణుడు వచ్చి బాగు చేస్తారని గతంలో గుత్తేదారుడు తెలిపారు. ప్రస్తుతం దీని గురించి పట్టించుకునే వారే కరవయ్యారు.

★ నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంటును బాగుచేయాలని నిపుణుడిని కోరిన పట్టించుకోవడం లేదు. ఒప్పందం అయిపోయింది. తమకు సంబంధం లేదని సమాధానం చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. ఇది కేవలం ఈ రెండు పాఠశాలల పరిస్థితి మాత్రమే కాదు. సంతబొమ్మాళి మండలంలోని పలుచోట్ల ఇలాంటి దుస్థితితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌కు తాళం

నిరుపయోగంగా మారాయి

విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మండలంలో పలు పాఠశాలల్లో మూలకు చేరాయి. వాటిని బాగుచేసి వినియోగంలోకి తీసుకు రావాలని సంస్థ నిర్వాహకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు లేదు. గత ప్రభుత్వం హయాంలో చిల్లిగవ్వ మంజూరు చేసిన పాపాన పోలేదు. దీంతో చాలా చోట్ల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందే సొంత నిధులు వెచ్చించి నీటిని అందిస్తూ విద్యార్థుల గొంతు తడుపుతున్నారు.

80 శాతానికి పైగా మూలకు..

సంతబొమ్మాళి మండలంలో సుమారు 30 పాఠశాలల్లో తొలి విడతగా శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అందులో ప్రస్తుతం పనిచేస్తున్నవి వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. 80 శాతానికి పైగా పనిచేయడం లేదు. యంత్రాల్లో నాసిరకం వస్తువులు వాడారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏర్పాటు చేశామా... డబ్బులు జేబులో వేసుకున్నామా... అన్నట్లు గుత్తేదారులు వ్యవహరించారు. వాటి నిర్వహణ సైతం గాలికొదిలేశారు. దీంతో చాలా చోట్ల విద్యార్థులు ఇంటి నుంచి నీటిని సీసాలతో తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మూలకు చేరిన పరికరాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని పలుమార్లు నిర్వహించిన సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు ఈ సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో గుత్తేదారుడు ప్లాంట్లు ఏర్పాటు చేసిన సందర్భాల్లో సాంకేతిక నిపుణుడు చరవాణి నంబరు అందించారు. పనిచేయడం లేదని ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– జె.చిన్నవాడు, ఎంఈవో, సంతబొమ్మాళి

నిర్లక్ష్యం పెరుగుతోందిలా!



ఇచ్ఛాపురం పట్టణంలోని కార్జీవీధి ఇళ్లసముదాయం మధ్యలో ఉన్న రాతికట్టు బావి నీటిని నేటికీ వాడుతున్నారు. అయితే దాని నిర్వహణపై పుర పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. బావి మధ్యలోంచి రాతి మొక్కలు పెరిగి వాటి నుంచి ఎండిన ఆకులు నీటిలో పడుతుండటంతో నీరు కలుషితమవుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావిని పరిశీలించి, అవసరమైన నిర్వహణ పనులు జరిపిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అధ్వాన దారి

సోంపేట - కంచిలి ప్రధాన రహదారి (పాత జాతీయ రహదారి) నుంచి కొత్త జాతీయ రహదారి పైవంతెన వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు నోచుకోక భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహన రాకపోకలకు అవస్థలు తప్పలేదు. వాహనాలు పాడవుతున్నాయని పలువురు వాపోతున్నారు. విషయమై ఆర్అండ్‌బీ ఏఈ డి.విక్రమ్ వివరణ కోరగా గతంలో ఈ రోడ్డు పనులను వేరొక గుత్తేదారుకి ఇచ్చాం. కొన్ని ప్రాంతాల్లో పనులు చేసినప్పటికీ వాటికి బిల్లులు విడుదల కాకపోవడంతో ఆగాయి. రెండు నెలల్లో పనులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి



తొట్టెలు నిరుపయోగం



కవిటి మండలంలోని పలు గ్రామాల్లో తోటల్లో ఆకులు, ఇతర చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి ఉపాధి హామీ పథకంలో తొట్టెలు నిర్మించారు. ప్రస్తుతం ఆ తొట్టెలు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ సమస్యను ఏవో బి.దుర్గాప్రసాద్‌ను తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రూ.10 వేలు చోరీ అనుమానం: యువకుడి హత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సురడా ఠాణా పరిధిలోని అమృతులు గ్రామానికి చెందిన కునా స్వెయిన్ (34) అనే యువకుడు రూ.10 వేలు చోరీ చేశాడన్న అనుమానంతో ఆయనను ఢెంకనాల్ జిల్లాకు చెందిన లారీ చోదకుడు శశికాంత్ సాహు (23), సహాయకుడు కమల్‌కాంత్ జెనా (20)లు హత్య చేశారు. గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పోలీసులు ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసి గురువారం న్యాయస్థానానికి తరలించారు. ఓ లారీ, దాడికి ఉపయోగించిన ప్లాస్టిక్ గొట్టం, రుమాలు, మూడు చరవాణులు స్వాధీనం చేసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటిన గొళంత్రా ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై భలియాగడ వద్ద కునా మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ❖ కారులో 1,200 లీటర్ల సారా స్వాధీనం గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలో ఓ కారులో అక్రమంగా రవాణా చేస్తున్న 1,200 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు చోదకుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు గురువారం సాయంత్రం తెలిపారు.

ఒడిశాలో బాలుడి కిడ్నాప్.. రక్షించిన రాచకొండ పోలీసులు

- బొమ్మలరామారంలో కిడ్నాపర్, బాలుడి గుర్తింపు
- క్షేమంగా తల్లికి అప్పగింత.. ఇద్దరు నిందితుల అరెస్టు
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఒడిశాలో అపహరణకు గురైన బాలుడిని రాచకొండ పోలీసులు కాపాడారు. బాలుడు 12 రోజుల క్రితం అపహరణకు గురవ్వగా ఒడిశా పోలీసుల అభ్యర్థనతో రంగంలోకి దిగిన భువనగిరి ఎస్‌వోటీ బృందం 24 గంటల్లోనే కేసును ఛేదించింది. బాలుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలం తూముకుంటలోని ఇటుకబట్టీల్లో ఉన్నట్లు గుర్తించి రక్షించింది. చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళను, అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్టు చేసింది. రాచకొండ సీపీ సుధీర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు.

సంతకు తీసుకెళ్లి కిడ్నాప్

ఒడిశాలోని బొలంగీర్ జిల్లాకు చెందిన పద్మిని మాఝీ (35) కూలి పనులు చేసుకునేది. భర్త చనిపోవడంతో చెడు సావాసాలకు అలవాటుపడింది. నౌపడ జిల్లా కోమ్నా పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన దుర్యోధన్ బరిహా(30)తో సహజీవనం చేస్తోంది. దుర్యోధన్ బతుకుదెరువు కోసం యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలానికి వచ్చి ఒక ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ ఒక చిన్నారిని అపహరించాలనుకున్నారు. పథకం ప్రకారం పద్మిని.. కోమ్నా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే దంపతుల దగ్గర పనికి కుదిరింది. వారి కుమారుడి(5)ని అపహరించాలనుకుంది. చిన్నారికి దుస్తులు తీసుకుందామంటూ కుటుంబం మొత్తాన్ని సెప్టెంబరు 29న స్థానిక సంతకు తీసుకెళ్లింది. దంపతులు పరధ్యానంగా ఉన్న సమయంలో చిన్న కుమారుడితో పరారైంది. ఒడిశా నుంచి రైల్లో సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి యాదాద్రి జిల్లా బొమ్మలరామారంలో ఉంటున్న దుర్యోధన్ దగ్గరకు వచ్చింది. ఇటుక బట్టీలో కార్మికులు ఎవరని ప్రశ్నిస్తే తన బంధువుల పిల్లాడని సమాధానమిచ్చేది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కోమ్నా పోలీసులు ఈనెల 29న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



బాలుడు, అతడి తల్లితో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రమణారెడ్డి, ఏసీపీ నరేందర్‌గౌడ్ తదితరులు

ప్రత్యేక బృందంతో బాలుడి గుర్తింపు

పద్మినికి తెలిసిన వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో తెలంగాణకు వచ్చి రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంటున్నట్లు అక్కడి పోలీసులు గుర్తించినా.. నిర్దిష్ట ప్రాంతం కనుక్కోలేకపోయారు. పోలీసులు దుర్యోధన్‌కి ఫోన్ చేసినా తనకు ఎవరూ తెలియదని బుకాయించాడు. దీంతో ఒడిశా పోలీసులు మంగళవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబును సంప్రదించి కేసు వివరాలు చెప్పారు. విషయం తీవ్రత దృష్ట్యా కమిషనర్.. బాలుడిని గుర్తించేందుకు ఐటీ సెల్, భువనగిరి ఎస్‌వోటీతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయించారు. సాంకేతిక ఆధారాలతో బాలుడు, నిందితురాలు పద్మిని బొమ్మలరామారం పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఎస్‌వోటీ బృందాలు ఇటుకబట్టీల్లో జల్లెడ పట్టగా తూముకుంట గ్రామ పరిధిలో చిన్నారి ఆచూకీ లభ్యమైంది. పద్మిని, అతడికి సహకరించిన దుర్యోధన్‌ని అదుపులోకి తీసుకున్నారు. కోమ్నా పోలీసులు, బాలుడి తల్లిదండ్రులకు సమాచారమివ్వగా గురువారం నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు.

దుర్గాదేవికి బిందెల దీపాలతో పూజలు

బలిజిపేట, పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బలిజిపేట, వంతరాం, తుమరాడ తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. వంతరాం గ్రామంలో భవానీ మాలలు ధరించిన భక్తులు గురువారం దుర్గాదేవి అమ్మవారికి నిమ్మకాయ దండలు వేసి బిందెల దీపాలతో పూజలు నిర్వహించిన అనంతరం కుంకుమ పూజలు చేశారు. ❖ పార్వతీపురం పట్టణం పాలకొండ రోడ్డులో యువత ప్రతిష్ఠించిన అమ్మవారి మండపంలో హోమం, కుంకుమ పూజ చేశారు. శ్రీవిద్యా సర్వమంగళ పీఠం వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో రాజ రాజేశ్వరికి నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర దంపతులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని మహిళలు పూజలు చేశారు.



వంతరాంలో బిందెల దీపాల పూజలందుకుంటున్న దుర్గాదేవి అమ్మవారు

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో అభివృద్ధికి నిధులు

అంగన్‌వాడీ కేంద్రాలను వైకాపా సర్కారు పట్టించుకోకపోవడంతో ఐదేళ్లపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతూ వెళ్లేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో పక్కా భవనాలున్న చోట మరుగుదొడ్లు, తాగునీటి కల్పన కోసం నిధులు మంజూరు చేసింది.

రూ.పదిన్నర లక్షలు మంజూరు..

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో మొత్తం 186 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. గత ప్రభుత్వంలో కనీస వసతులపై దృష్టి పెట్టిన దాఖలాలు లేకపోవడంతో కూటమి ప్రభుత్వం వీటి మెరుగుకు పూనుకుంది. తొలి విడతగా పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు చర్యలు చేపట్టింది. 36 చోట్ల పనుల కోసం దాదాపు రూ.పదిన్నర లక్షలు మంజూరు చేసింది. ఇందులో 22 కేంద్రాలకు మరుగుదొడ్లు, 14 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు మొదలయ్యాయి.

కాశీబుగ్గ ప్రాజెక్టు పరిధిలోని	కేంద్రాలు:	చిన్నారులు:	గర్భిణులు:	బాలింతలు:
	186	1741	814	766



కేదారిపురంలో నీటి సదుపాయం లేని మరుగుదొడ్డి

మరుగుదొడ్డి ఉన్నా... నీళ్లు రావు

పలాస మండలం కేదారిపురం అంగన్‌వాడీ కేంద్రంలో రెండు మరుగదొడ్లు ఉన్నా అందులో ఒక గది వినియోగానికి నోచుకోలేదు. మరో దాన్ని వినియోగిస్తున్న నీటి సౌకర్యం లేదు. బకెట్లతో బయట నుంచి నీరు తీసుకెళ్లాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ఈ కేంద్రంలో ఆరుగురు చిన్నారులు, ఇద్దరు గర్భిణులు, ఆరుగురు బాలింతలు ఉన్నారు. మరుగుదొడ్లలో నీరు వీరంతా ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రానికి తాగునీటి ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని చినంచలలోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగింత..

మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పన పనుల ఏర్పాటు బాధ్యతలను గ్రామీణ నీటి సరఫరా శాఖకు అప్పగించారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేల చొప్పున 22 పనులకు రూ.7.92 లక్షలు, తాగునీటి కల్పనకు ఒక్కో కేంద్రానికి రూ.17 వేల చొప్పున 14 పనులకు రూ. 2.38 లక్షల మేర కేటాయించారు. వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ డీఈఈ పైడి సూర్యనారాయణ తెలిపారు.

త్వరలోనే ప్రారంభం

పక్కా భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. మంజూరైన కేంద్రాల్లో త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- పార్వతి, సీడీపీవో, కాశీబుగ్గ